క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: భీమవరం స్టాకిట్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నార్కెడమిల్లి గురుప్రసాద్, గొంట్లా వేణుగోపాలగుప్తా, ఉపాధ్యక్షుడిగా వనమా శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా రావూరి వెంకటశివప్రసాద్, కోశాధికారిగా మానేపల్లి వీరవెంకటరవి చిన్నారావు మరో 5గురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. అలాగే ఛాంబర్ కార్యవర్గసభ్యునిగా నార్కెడమిల్లి గురుప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

వైభవంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఉత్సవ విగ్రహాల్ని ఊరేగింపుగా తరలిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: స్థానిక మాదివాడలోని పురాత కోదండ రామాలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపలి గంగాధరరావు ఆర్థిక సహకారంతో తయారు చేయించిన పంచలోహ ఉత్సవ విగ్రహాలను ఆయన కుటుంబ సభ్యులు నివాసం నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లి అర్చకులు లంక జలదుర్గ ప్రసాద్‌కు అందజేశారు. మాదివాడలోని కోదండ రామాలయం నిర్మించి నాలుగున్నర దశాబ్దాలు పైబడింది. ఈ సందర్భంగాఆలయంలోని విగ్రహాలు జీర్ణోద్ధరణకు చేరడంతో నూతన విగ్రహాల్ని తయారు చేయించి ఈ నెల 4న ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా బుధవారంఆలయ ప్రాంగణంలో పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాల్ని మోటుపల్లి సుబ్బారావు, కనకదుర్గాదేవి దంపతులు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు నాగన్నకు పరామర్శ



నాగన్నను పరామర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు దింటకుర్తి నాగేశ్వరరావు(నాగన్న)ను ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు బుధవారం నాగన్నను పరామర్శించారు. నాగన్న త్వరగా కోలుకోవలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), కేశిరెడ్డి మురళీ, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను నిలుపుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు

ఆకివీడు: లేబర్ కోడ్‌లను నిలుపుదల చేసి, కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహమైందని సీపీఎం మండల కార్యదర్శి కే.తవిటినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ ప్రతినిధుల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేస్తుందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమ పథకాలను నీరుగారుస్తూ కొత్త విధానాల్ని తీసుకువస్తుందని ధ్వజమెత్తారు. పెంకి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బొర్రా శ్రీను, బొప్పనపల్లి ఆదాము, బర్నాల అప్పలనాయుడు, పంపన వెంకటరమణ, కొట్టాడ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

ఉండి: గ్రామంలో మైక్రో వాటర్ ఫిల్టర్‌ల నిర్మాణంతో తాగునీటి సమస్య తీరిపోతుందని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవీటి సాంబశివరావు అన్నారు. బుధవారం గ్రామంలో కెనరాబ్యాంక్, గ్రామ పంచాయతీ నిధులు రూ.9 లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్‌లను ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన అధికారులను సర్పంచ్ సాంబశివరావు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట్రాజు, యిర్రింకి బుజ్జీ,కొండవేటి సత్యనారాయణ,దాసరి సనాతన,గుండాబత్తుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైరస్‌తో వనామీ విలవిల

- నాణ్యతలేని సీడ్‌తో వైరస్ ప్రభావం
- భారీ పెట్టుబడులతో పెంపకం
- ఆందోళనలో రొయ్య రైతులు



గూట్లపాడు వైరస్‌బారిన పడిన రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు (ఫైల్)



రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు వాతావరణం వనామీ రొయ్యల పెంపకానికి అనుకూలించడంతో రైతులు భారీగా పెట్టుబడులు పెంపకాన్ని సాగిస్తున్నారు. ఎప్పుడూ ఏప్రిల్ నెల రాగానే రైతులు రొయ్యల సీజన్‌గా భావించి భారీ పెట్టుబడులు పెట్టి గంపెడు ఆశలతో సాగు చేసినప్పటికీ నాణ్యతలేని సీడ్ కారణంగా వైరస్ విజృంభించి చెరువుల్లో వనామీ పిల్లలను వదిలిన 20 రోజుల్లోనే మృత్యువాత చెందుతున్నాయని రైతులు చెబుతున్నారు. మూడు నెలలు రొయ్య పెంపకం చేస్తే పెట్టుబడులు పోను కొంత మిగులుబడి రావడంతో రైతులు రొయ్య పెంపకంపై మొగ్గు చూపిస్తున్నారు. అయితే రెండు వారాలుగా పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి రాత్రులు చలిగాలులు వేయడంతో నాణ్యతలేని సీడ్‌కు త్వరితగతిన వైరస్ ప్రబలి మృత్యువాత చెందుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. భీమవరం మండలంలో దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, అనాకోడేరు, నాగిడిపాలెం, వెంప, తోకతిప్ప, లోసరి, దొంగపిండి తదితర గ్రామాల్లో సుమారు 7 వేల ఎకరాల్లో వనామీ పెంపకాన్ని చేస్తున్నారు. సీజన్‌లో ఆక్వా హబ్‌గా పేరుగాంచిన భీమవరం పరిసర ప్రాంతాలలో రోజుకు సుమారు 100 టన్నులకు పైగా విదేశాలకు ఎగుమతులు జరుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. కోట్లలో విదేశీమారకద్రవ్యం రాష్ట్రానికి చేకూరుతుంది. ప్రస్తుతం రొయ్యలు సీడ్ దశలోనే ఉన్నాయి.

వైరస్ దాడికి మృత్యువాత పడుతున్న రొయ్యలు

పగలు పూట ఉష్ణోగ్రతలు పెరిగిపోయి, రాత్రులు చలిగాలులు వేయడంతో చెరువుల్లోని నీటి పరమలువులైన పీహెచ్, అమ్మోనియా, నైట్రోజన్, ఆక్సిజన్ శాతంలలో హెచ్చుతగ్గులు ఏర్పడి రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, తదితర వైరస్ రొయ్యలకు వ్యాప్తి చెంది మృత్యువాత చెందుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ వైరస్‌లు వల్ల 30 రోజుల లోపే రొయ్యలు మృత్యువాత చెంది తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు మందులు వాడినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు.

నాణ్యతలేని సీడ్‌తో ఇబ్బందులు

ఎక్కడిబడితే అక్కడ పుట్టగొడుగుల్లా వనామీ ఉత్పత్తి కేంద్రాలు రావడంతో ఏది నాణ్యమైన రొయ్యపిల్లో, కాదో తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. నాణ్యత, నాణ్యతలేని సీడో తెలుసుకోవడానికి పీసీఆర్ పరీక్ష ద్వారా ఈహెచ్‌పీ, విబ్రియో, వైట్ స్పాట్ పరీక్షలు చేస్తేనేగానే తెలియదు. నాణ్యమైన సీడ్ లభించాలంటే లక్ష పిల్లలకు రూ. 32 వేలు నుంచి 40 వేలు వరకు ఉంది. నాణ్యతలేని సీడైతే లక్ష పిల్లలకు రూ. 17 వేలు నుంచి 24 పైసలు ఉన్నప్పటికీ 50 శాతం నుంచి 100 శాతం వరకు ప్రకటించడంతో రైతులు వాటికి ఆశపడి నష్టపోతున్నారు.

నాణ్యతలేని హేచరీలను నిర్మూలించాలి

మత్స్యశాఖాధికారులు వనామీ ఉత్పత్తి కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి నాణ్యతలేని సీడ్ ఉత్పత్తి చేస్తున్న హేచరీలను నిర్మూలించాలి. ప్రతి ఏటా ఈ సీజన్‌లో పెట్టుబడులు పోను కొంతైనా మిగిలేది. సీడ్ క్వాలిటీ లేకపోవడంతో వేసిన 15 రోజుల నుంచే వైరస్ ప్రభావం చూపుతుంది.

సీడ్ వేసిన నెలరోజుల్లోనే వైరస్ వచ్చేసింది

> నేను ఎకరాన్నరలో రొయ్యల చెరువు చేస్తున్నాను. ఎండలు ఎక్కువగా ఉన్నాయని నెల రోజులు క్రిందట సీడ్ తెచ్చి వేశాను. వైరస్ సోకడంతో పిల్ల దశలోనే రొయ్యలు చనిపోతున్నాయి. రొయ్య మేత, మందులు, కూలీల రేట్లు పెరిగిపోవడంతో నెల రోజుల్లోనే రూ. 2 లక్షలు పైగా నష్టపోయాను.
>
> ఎస్. వెంకటేశ్వర్లు, రొయ్య రైతు, దొంగపిండి

ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

భీమవరం (ప్రకాశంచౌక్): మండలంలో చిన్నారుల ఆధార నమోదుకు ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కాళ్ల ఎంపీడీవో జి స్వాతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాళ్ల మండలంలో 12 చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆమె బుధవారం తెలిపారు. గురువారం నుంచి ఆరు రోజులపాటు జరిగే ఈ క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొండాడ, దొడ్డనపూడి - 1, జువ్వలపాలెం, కోలనపల్లి సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. వీటికి సంబంధించి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో పాటు సిబ్బంది సూచనలు ఇచ్చి ఆయా గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియపరిచామన్నారు.

ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ చేయించాలి

వీరవాసరం: పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆకస్మిక మృతిపై ప్రత్యేక విచారణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు డిమాండ్ చేశారు. వీరవాసరంలో బుధవారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల నిరసన ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రవీణ్ అనుమానాస్పద మృతిని యాక్సిడెంట్ కేస్ గా పరిగణించడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని సంతాపం ప్రకటించారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో వెంపల్ల నరసింహమూర్తి, తాడి రాజశేఖర్, గెడ్డం భాస్కరరావు ,క్రైస్తవ సంఘ నాయకులు ,పాస్టర్లు పాల్గొన్నారు.

రీసర్వే పనుల్లో తప్పిదాలను నివారించాలి



రీసర్వేపై సిబ్బందికి సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

పాలకోడేరు: రీ-సర్వే పనుల్లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా పూర్తిస్థాయిలో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులును ఆదేశించారు. బుధవారం మండలంలోని పైలెట్ గ్రామం అయిన శృంగవృక్షం గ్రామంలో రీ-సర్వే పనులకు సంబంధించి పెన్నాడ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ రూమును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆకస్మిక సందర్శించారు. శృంగవృక్షం గ్రామానికి సంబంధించిన రీ సర్వే వెక్టోజేషన్ పనులు, రికార్డులను, డేటాను పరిశీలించారు. సిబ్బందికి రీ సర్వేపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే వెక్టోజేషన్ డిజిటల్ పనులను పూర్తి చేసి రైతులకు నోటీసులు అందజేయాలని అన్నారు. రీ సర్వే పనులు సంతృప్తిగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. మిగిలిన రీ సర్వే పనులలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఈనెల 15 నాటికి పూర్తిస్థాయిలో నిర్వహించాలని సంబంధిత అధికారులును ఆదేశించారు. అలాగే మండలంలోని కుముదవల్లి గ్రామంలో కూడా రీ-సర్వే పనులు మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్, మండల సర్వేయర్లను ఆదేశించారు. తొలుత విస్సాకోడేరు గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండియూ వాహనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ విజయలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీ-సర్వే డీటీ కె.సూర్య నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి



ఉండి: ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాస్



ఆకివీడు: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఉండి: ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు,హెల్పర్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గత సీజన్‌లో తలెత్తిన తేమ శాతం సమస్య పరిష్కారంగా ఈ సీజన్‌లో బ్లూటూత్‌తో తేమశాతం పరీక్షించేందుకు ఏర్పాట్లు చేయడంతో మస్య పరిష్కారం అవుతుందని అన్నారు. మండల వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ రబీ సీజన్ 2024-25 సీజన్‌కు సంబంధించి ధాన్యం రవాణా చేసే వాహనాలు రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర పొందాలి

ఆకివీడు: ధాన్యానికి మద్దతు ధర లభించాలంటే తేమ లేకుండా కొనుగోలు కేంద్రాలకు శాంపిల్స్ తీసుకురావాలని ఏడీఏ కె.శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాళ్ల కామన్ ధాన్యానికి రూ. 2300లు, గ్రేడ్-ఏ ధాన్యానికి రూ. 2320లు ధర ప్రకటించిదని చెప్పారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించిందని చెప్పారు. ధాన్యం షెడ్యూలింగ్‌కు 73373 59375కు హాయ్ అని మెసేజ్ ఇస్తే ధాన్యం షెడ్యూలింగ్ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ప్రియాంక, రూరల్ బ్యాంక్ సిబ్బంది, మిల్లర్లు పాల్గొన్నారు.



భీమవరం అర్బన్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఓ నిమ్మల శ్రీనివాస్

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు

భీమవరం అర్బన్: పండించిన ధాన్యాన్ని రైతులు కావాల్సిన మిల్లులకు తోలుకోవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వీఆర్‌వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పీపీసీ టెక్నికల్ అసిస్టెంట్లకు ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యంలో తేమ శాతం 17 మాయిశ్చర్ ఉండాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని వారికి అనుకూలమైన మిల్లులకు రైతు సేవా కేంద్రాలు ద్వారా విక్రయించుకోవచ్చన్నారు. క్వింటాళ్లకు కామన్ ధర రూ. 2వేల 300, ఏ గ్రేడ్ రకం అయితే రూ. 2 వేల 320 ఉన్నదన్నారు. ఆర్ఎస్‌కే ద్వారా గోనె సంచులు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. తహసీల్దార్ రావి రాంబాబు మాట్లాడుతూ ట్రక్ సీట్‌తోనే ధాన్యాన్ని రవాణా చేసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమఅవుతాయన్నారు. ఈ సదస్సులో వీఆర్‌వో, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



భీమవరంలోని సీవీ రామన్ స్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పుస్తక పఠనంతో విజ్ఞానం సమకూరుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలని భీమవరం డీఎన్నార్ కళాశాల రిటైర్డ్ గ్రంథాలయాధికారి అల్లూరి నర్సింహరాజు అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా సర్‌సీవీ రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్యం నుంచి పుస్తక పఠనం ఎంతో అవసరమని మంచి పుస్తకమే మంచి నేస్తామన్నారు. తెలుగు భాషాభివృద్ధి కమిటీ సభ్యుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో లభ్యమవుతాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, కె పార్వతి, శైలజ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఫుల్‌స్టాప్ డెవలప్‌మెంట్ కోర్స్‌పై శిక్షణ



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఆన్‌లైన్ కోర్సు శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కోడింగ్ క్లబ్ వీల్స్‌డాట్ ఏఐతో కలిసి మూడు నెలల పాటు ఆన్‌లైన్‌లో ఫుల్‌స్టాప్ డెవలప్‌మెంట్ కోర్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. బుధవారం కళాశాలలో ఆన్‌లైన్ కోర్స్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. విల్స్‌డాట్ ఏఐతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా రెండు నెలల శిక్షణ, నెలరోజులు ఇంటెర్న్‌షిప్ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ శిక్షణ కోర్స్ ఈనెల మూడవ వారంలో ప్రారంభిస్తామని ప్రిన్సిపల్ చెప్పారు. విద్యార్థులు శిక్షణ పొందేందుకు ముందుగా నమోదు చేసుకోవాలని శిక్షణలో ప్రధానంగా పరిశ్రమకు చెందిన నిపుణులు, వాస్తవ ప్రపంచంలో జరుగుతున్న సాంకేతిక ప్రగతిని అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, కోడింగ్ క్లబ్ కన్వీనర్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాటిక పోటీలు



జనరల్ బోగీ నాటికలో సన్నివేశాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉగాది నాటిక పోటీలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి జనరల్ బోగీలు నాటిక పాల్గొన్న సభికులను అలరించింది. జనరల్ బోగీలో ప్రయాణిస్తు తన కొడుకు మృత్యువాతకు గురైతే అప్పటినుంచి మృతి చెందిన తన కొడుకు ఆచూకీ కోసం తల్లి పడుతున్న వేదన ఈ నాటిక. నిర్లక్ష్యానికి గురవుతున్న జనరల్ బోగీలు, రక్షణ, సౌకర్యాలు, భద్రతా లోపాలు అంశాలపై ఈ నాటిక ఎండకట్టింది. రైలు ప్రమాదంలో జనరల్ బోగిలో ప్రయాణించే వారు వివరాలు ఉండవు. మృతి చెందిన వారి వివరాలు, ఆచూకి తెలియదు. రిజర్వేషన్ బోగీలతో సమానంగా జనరల్ బోగీలు సంఖ్యను పెంచాలని, జీవితంలో రైలులో జనరల్‌బోగి ఎక్కని ప్రయాణీకుడు ఉండడుని, జనరల్‌బోగిలోకూడా భద్రంగా ప్రయాణించే రక్షణ కావాలని తదితర అంశాలను ఈ నాటికలో ప్రదర్శించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా కొండాలమ్మ ఉత్సవాలు

పెంటపాడు: మండలంలోని రావిపాడులో ఉగాది మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన కొండాలమ్మ అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా స్థానిక అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. గూడెం పట్టణం, బోడపాడు, రావిపాడు, అలంపురం, దువ్వ గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఉప్పులూరి నాగసత్తులు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఉప్పులూరి అంజిబాబు, ఝాన్సీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా-డ్రైవర్‌కు గాయాలు

పెనుగొండ: ఆచంట మండలం కోడేరు బ్రాంచ్ కెనాల్లో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కోడేరు రేవు వద్ద లాకుల సమీపంలో ఏటిగట్టు వద్ద గత కొన్నేళ్ల నుంచి నిద్రగన్నేరు చెట్టు లాకుకు ఇబ్బందిగా ఉండడంతో చెట్టును బుధవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే తొలగించిన కొమ్మలను ట్రాక్టర్ సహాయంతో తీసుకెళ్లే సమయంలో వంతెనపై కర్రల లోడుతో ఉన్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బ్రాంచ్ కెనాల్లోకి పడిపోయింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్ను బయటకు తీసుకు వచ్చారు. డ్రైవర్ కు తీవ్రగాయాలు కావడంతో వెంటనే 108 వాహనం ద్వారా పాలకొల్లు తరలించారు. దీంతో పెద్దప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. లాకుల వద్ద గత కొన్ని ఏళ్లుగా నిద్రగన్నేరు చెట్టు అడ్డుగా ఉండటంతో కమిటీ సభ్యుల తీర్మానం మేరకు చెట్టు, చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టామని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

564 మందికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు సందర్భంగా బుధవారం లబ్దిదారులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణం లబ్దిదారులతో కిక్కిరిసిపోయింది. దొడ్డనపూడి, బొండాడ, ఏలూరుపాడు, జక్కరం, కలవపూడి గ్రామాల్లో వివిధ యూనిట్లకు సంబంధించి లోన్లు కోసం దరఖాస్తు చేసుకున్న 564 మందికి తొలిరోజు ఇంటర్వ్యూలు జరిపినట్లు ఎంపీడీఓ జి.స్వాతి బుధవారం తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - కాళ్ళ, కలవపూడి, జువ్వలపాలెం బ్రాంచ్ ల ప్రతినిధులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - కోపల్లె, ఏలూరుపాడు బ్రాంచ్ ప్రతినిధులు, అదేవిధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా - కాళ్ల బ్రాంచ్ ప్రతినిధులు లబ్దిదారులతో ఇంటర్వ్యూలు జరిపినట్లు ఆమె పేర్కొన్నారు. గురువారం ఎనిమిది గ్రామాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

నేడు ఆకివీడులో ఇంటర్వ్యూలు

ఆకివీడు: వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుహాసిని బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని వివిధ సచివాలయాల నుంచి 1475 దరఖాస్తులు అందాయని చెప్పారు. వాటిలో బీసీ రుణాల కోసం 512, కాపు రుణాల కోసం 908 మంది, ఈబీసీ రుణాల కోసం 54 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలోని అయిభీమవరం, చెరుకుమిల్లి, అజ్జమూరు, కుప్పనపూడి గ్రామాల లబ్దిదారులకు ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుండి పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, అప్పారావుపేట, తరటావ, సిద్ధాపురం, కోళ్లపర్రు గ్రామాల లబ్దిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.